హైడ్రా.. పేదలపాలిట శాపం

ఆర్‌పీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి పేరం శివనాగేశ్వర్‌రావు



సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆర్‌పీఐ సభ్యత్వాన్ని అందజేస్తున్న శివనాగేశ్వర్‌రావు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైడ్రా పేదల పాలిట శాపంగా మారిందని ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య అని ఆర్‌పీఐ (అథావలే) జాతీయ ప్రధాన కార్యదర్శి పేరం శివనాగేశ్వర్‌రావు గౌడ్ విమర్శించారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆర్‌పీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివనాగేశ్వర్‌రావుగౌడ్ మాట్లాడుతూ... కూల్చాలనుకుంటే రాజ్యాంగబద్ధంగా నోటీసులు ఇచ్చి పేదలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి తప్పా ఏకపక్షంగా కూల్చడం సరైంది కాదన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వకుండా ఎలా కూల్చుతారని ప్రశ్నించారు. పేద ప్రజలకు తమ పార్టీ మద్దతు ఉంటుందని తమ పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి రాందాస్ అథావలే దృష్టికి ఇట్టి విషయాన్ని తీసుకుపోయి చర్చిస్తామన్నారు. హైడ్రా వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సౌత్ ఇండియా ఉపాధ్యక్షురాలు వల్లూరు దీన, కోఆర్డినేటర్ కొంపల్లి ప్రభుదాస్, కూరేళ్ళ వేములయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నప్రసాద్, ఉపాధ్యక్షులు గోరకసింగ్, గడ్డి రవికుమార్, మహిళా ఇన్‌చార్జి రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు నిల్వకుండా చూడండి

చిక్కడపల్లి: నాలా ప్రహరీ వద్ద వరదనీరు నిల్వకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ పావని అన్నారు. అశోక్‌నగర్ స్ట్రీట్ నం.1 సౌభాగ్య అవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలో రిటర్నింగ్ వాల్ వద్ద వరదనీరు నిలుస్తోందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఇరిగేషన్ శాఖ ఏఈ శ్యాం సుందర్, జీహెచ్ఎంసీ ఏఈ అబ్దుల్ సలామ్, వర్క ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలసి ఆమె పరిశీలించారు. వరదనీరు నాలాల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్‌లో నిలిచిన వరదనీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని, అధికారులు

క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయి

డీఈవో ఆర్ రోహిణి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డిప్యూటీ ఈవో చిరంజీవి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని హైదరాబాద్ జిల్లా డీఈవో ఆర్ రోహిణి అన్నారు. విద్యార్థుల సంపూర్ణ నైపుణ్యాలను సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ జిల్లా ముషీరాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా, మండలస్థాయిల్లో జరిగిన కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలలో బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ క్రీడాపోటీల్లో గెలుపొందిన అంబేద్కర్ పాఠశాల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం రోహిణి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతరం క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. గెలుపోటములు సహజమేనని అయితే ఓటమిని స్ఫూర్తిగా తీసుకొని మరింత పటిమతో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో చిరంజీవి, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, పాఠశాల కరస్పాండెంట్ సరోజ వివేక్, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, పీఈటీ సురేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఘనంగా అక్కినేని నాగేశ్వరరావు జయంతి



సుబ్బరాయశర్మ, మల్లాది భాస్కర్, లంకా లక్ష్మీనారాయణలకు అక్కినేని రంగస్థల పురస్కారాలను అందజేస్తున్న జస్టిస్ భవానిప్రసాద్

చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థ అభినందన, త్యాగరాయ గానసభల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభినందన అక్కినేని రంగస్థల పురస్కారాలను నటులు సుబ్బరాయశర్మ, మల్లాది భాస్కర్, లంకా లక్ష్మీనారాయణలకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రదానం చేసి సన్మానించారు. తొలుత మల్లాది భాస్కర్ బృందం ప్రదర్శించిన హాస్యగుళికలు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీసం, నిర్వహణ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి భవాని, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

4 లేబర్ కోడ్‌లు, 3 నేర చట్టాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి

ఇందిరాపార్కు వద్ద ఐఎఫ్‌టీయూ ధర్నా



మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కవాడిగూడ: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని ప్రజా కార్మిక వ్యతిరేక నేర చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బూరుగుల ప్రవీణ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తాదినేని వెంకటేశ్వర్‌రావు, టి. శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భారత కార్మిక సంఘాల సమైఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా చేపట్టారు.

◆ ఈ కార్యక్రమంలో తాదినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, సాక్ష ఆధునియమం మరింత కఠినంగా ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాలు జూలైలో అమలుల్లోకి వచ్చిన మరుక్షణమే 650 జిల్లాలో 16వేల పోలీస్‌స్టేషన్ల పరిధిలో హడావిడిగా అమలు చేస్తున్నారని అన్నారు. ఈ చట్టాలు మరో 20కొత్త నేరాలను చేర్చినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్రభుత్వ పరిశ్రమల్లో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులను కుదిస్తూ కాంట్రాక్ట్ కార్మికులను నియమిస్తున్నారని ఇది ఆమోదయోగ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న 3లక్షల మంది కార్మికులకు కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం, చట్టబద్ధ హక్కులు లభించని పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్లు కార్మికులు, ఉద్యోగులుగా గుర్తింపు లేకుండా పోయిందన్నారు.

◆ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు న్యాయం జరిగే విధంగా చట్టాలను మార్పు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణ, జనార్దన్, నేతలు అరుణ, శివబాబు, భూమయ్య, దాసు, జె. సీతారామయ్య, శ్రీధర్, గీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట సర్కిల్ ఈఈగా రమేశ్ బాబు



ఎమ్మెల్యే కాలేరును కలిసిన ఈఈ రమేశ్‌బాబు

అంబర్‌పేట: జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్–16కు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈఈగా రమేశ్ బాబు కొత్తగా బాధ్యతలు తీసుకున్నారు. ఇతని స్థానంలో ఉన్న పేర్రాజు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు తీసుకున్న ఈఈ రమేశ్ బాబు సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిస్థితులు అభివృద్ధి పనుల వంటి అంశాలను ఈఈతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్,ఏఈ ప్రశాంతి, ఇతర సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: భారతీయ విద్యాభవన్ హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అక్టోబర్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, అక్టోబర్ 14వ తేదీ నుంచి బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు ఫోన్: 040–23241629.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం. చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని మహిళ (50) ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళిత కవిత్వానికి ప్రథముడు జాషువా



మాట్లాడుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: జాషువా రచనలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయ గాన సభ నిర్వహణలో పద్మవిభూషణ్ గుర్రం జాషువా యాదిలో శీర్షికతో గుండవరపు హనుమంతరావు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాషువా రాసిన కవితల్లో దళితుల ఆవేదన ప్రతిధ్వనిస్తుందన్నారు. తెలుగు సాహిత్యంలో తొలి దళిత కవిత్వానికి ప్రథముడన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. త్యాగరాయగానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు విద్యాధరరావు, కోయి కోటేశ్వరరావు, సుధాకర్, భవాని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత బీజేపీతోనే సాధ్యం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: దేశ సమగ్రత, సమైఖ్యత బీజేపీతోనే సాధ్యమని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ పేర్కొన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని రోటరీ కాలనీలో అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్పొరేటర్ రచనశ్రీ ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశ సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కవాడిగూడ డివిజన్‌లో గతం కంటే ఎక్కువ సభ్యత్వ నమోదు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కేశవరాజుగుప్తాలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉద్యోగ విరమణ పొందిన మదన్‌మోహన్‌ను సన్మానిస్తున్న డా. రియాజ్, పళని కదిరవన్

చిక్కడపల్లి: గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ టీఎన్‌జీవోఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో ఉప గ్రంథ పాలకుడు గ్రేడ్–1 ఉగ్యోగిగా డిచెర్ల మదన్‌మోహన్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ రియాజ్, అడిషనల్ కలెక్టర్ పళని కదిరావన్, కార్యదర్శి పి.పద్మజ ఈ సందర్భంగా మదన్‌మోహన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా. రియాజ్ మాట్లాడుతూ.. నవంబర్ 14 జవహర్‌లాల్ జన్మదినం సందర్భగా 20వ తేదీ వరకు గ్రంథాలయాల వారోత్సవాలు కూడా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డిని తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా కదిరవన్, పద్మజ మాట్లాడుతూ.. నిబద్ధతో ఉద్యోగం చేసే వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంఘం అధ్యక్షులు శాంగటి అయోధ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం మహేందర్, గ్రంథాలయ మాజీ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ డిమాండ్



బాధితుడు సత్యనారాయణ బాబును పరామర్శిస్తున్న ముఠా జైసింహ, బీఆర్ఎస్ నాయకులు

కవాడిగూడ: బీఆర్ఎస్ ముషీరాబాద్ నాయకుడు సత్యనారాయణ బాబుపై అకారణంగా దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ డిమాండ్ చేశారు. ముషీరాబాద్ పోలీసుల దాడిలో గాయపడ్డ సత్యనారాయణ బాబును సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని వినోభానగర్‌లోని అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోలీసులు అన్యాయంగా సత్యనారాయణపై దాడి చేసి చేయి విరగ్గొట్టారని పేర్కొన్నారు. పేద కుటుంబానికి చెందిన సత్యనారాయణ బాబును పోలీసులు ఉన్నతాధికారులు అన్ని విధాలా ఆదుకొని మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, డి.శివముదిరాజ్, పూసగోరక్‌నాథ్, భాస్కర్ నేత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) 26 వసంతాల ఆవిర్భావ వేడుకలను ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి. స్కైలాబ్‌బాబులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల గ్రామస్థాయిల్లో జెండాలను ఎగురవేస్తూ వేడుకలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆత్మగౌరవ, సమానత్వం, అంటరానితనం, కులవివక్షతకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నామని వారు తెలిపారు. అంటరాని తనంపై వందలాది గ్రామాలలో వేలాది మంది కార్యకర్తలచే సర్వేలు నిర్వహించి కులనిర్మూలనకు కృషిచేసినట్లు వారు తెలిపారు.

హెల్త్ ఇన్సురెన్స్ రూ.5లక్షలకు పెంచాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జలమండలిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి హెల్త్ ఇన్సురెన్స్‌ను రూ.3లక్షల నుంచి రూ.5లక్షలు పెంచాలని సోమవారం వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు జి. రాంబాబు యాదవ్ ఆధ్వర్యంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. గత మూడేళ్లలో ఆస్పటల్‌లో ట్రీట్‌మెంట్ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని రూ.3లక్షల ఇన్సురెన్స్ ఏమాత్రం సరిపోవడం లేదని వారు కోరారు. ఇటీవల కాలంలో ఓవర్‌టైం పనిచేసే ఉద్యోగులకు పారితోషికాన్ని పెంచాలన్న విషయాన్ని కూడా ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎండీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఐద్వా నగర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మ, వరలక్ష్మి



కవాడిగూడ: ఐద్వా నగర కార్యదర్శులుగా పద్మ, వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం గోల్కొండ క్రాస్‌రోడ్‌లో ఐద్వ నగర కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్, సెంట్రల్ సిటీ, ఐద్వా 4వ మహాసభలను నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి. సరళ హాజరై మాట్లాడుతూ... దేశంలో మహిళలపై గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని చిన్నపిల్లల నుంచి మొదలుకోని ముసలివారి వరకు ఇంట్లో ఉన్నవారికి కూడా రక్షణ కరువయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం బేటీ బచావో.. బేటీ పడావో నినాదం ఆచరణలో సాధ్యంకాక అనేక కేసులలో బీజేపీ నాయకులు నేరస్తులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు సంఘటితంగా ఉండి ఐక్యపోరాటాలు చేసినప్పుడే మహిళల హక్కులు సాధించబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర ఉపాధ్యక్షులుగా కె. నాగలక్ష్మి, పి. విమల, శారద, సహాయ కార్యదర్శులుగా షబానా బేగం, ప్రవళిక, రాధిక, కోశాధికారిగా ఎల్ భవాని ఎన్నికయ్యారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి.. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచండి

కవాడిగూడ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4500 కోట్లను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు వద్ద బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ ఫ్రంట్ చైర్మన్ కొరిగె మల్లేష్ యాదవుల ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయం ముట్టడితో పాటు రాష్ట్రాన్ని నిర్బంధిస్తామని ఆయన హెచ్చరించారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్, గుజ్జ సత్యం, జె.అంజి, అనంతయ్య, రాజేందర్, నందగోపాల్, రామ్మూర్తి, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా వెంకటేశం

కాచిగూడ: బెంగళూర్‌లో జరిగిన ఏఐటీయూసీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ జాతీయ మహాసభలలో జాతీయ ఉపాధ్యక్షుడిగా వెంకటేశం ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఈ సందరర్భంగా నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆయనను రాష్ట్ర నేతలు, సింగరేణి కాలనీ ఆటో డ్రైవర్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ జంగయ్య, జె.శ్యామ్ లాల్‌నాయక్, వనం అడవయ్య, ఎస్.శ్రీను, ఎన్.హరిలాల్, బలరామ్, కిషన్, దీప్లా తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కాచిగూడ: తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాదుల శ్రీకాంత్ అధ్యక్షతన టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. గ్రామ పంచాయతీలలో పనిచేసే సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని వారు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు.

ప్రతిభ ఉంటే ఏ రంగంలోనైనా రాణిస్తారు

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



సర్టిఫికెట్ సెరెమనీకి హాజరైన విద్యార్థులు



ఆర్ఎస్‌టీ టెక్నాలజీలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: ప్రతిభ ఉంటేనే యువత ఏ రంగంలోనైనా రాణిస్తారని, అందుకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలని మెరుగుపర్చుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు మెరుగు పరుచుకుంటే ఉపాధి వకాశాలు వాటంతట అవే వెతుక్కుంటూ వస్తాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులపై ఆసక్తి పెంచుకోవాలని యువతకు సూచించారు. సోమవారం న్యూనల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ(ఆర్ఎస్‌టీ), డియాజియో ఓరియన్ ఇంటర్నేషనల్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్ఎస్‌టీలో వృత్తి నైపుణ్య కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు జ్యోతి ప్రజ్వలన కావించి, విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు.

◆ ప్రస్తుతం చదువుకున్న దానికి మార్కెట్‌లోకి వచ్చాక పరిస్థితులు వేరే విధంగా ఉంటాయన్నారు. సర్టిఫికెట్లు, మార్కులతో సంబంధం లేకుండా జీవితంలో స్థిరపడాలంటే కావాల్సిన నైపుణ్యాలను సొంతం చేసుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని,దానన్ని సద్వినియోగం చేసుకోకుండా, తల్లిదండ్రులు చేసే పనులను మళ్లీ మీరు చేయవద్దని యువతకు సూచించారు. యువతలో వృత్తి నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వృత్తి నైపుణ్య కోర్సులు ప్రారంభించిదన్నారు. వృత్తి నైపుణ్యాలు ఉన్న వారికి తెలంగాణతో పాటు విదేశాల్లోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

◆ రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ(ఆర్ఎస్‌టీ), డియాజియో ఓరియన్ ఇంటర్నేషనల్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో నిరుద్యోగ యుతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా, తన దృష్టికి తీసుకు రావాలని ఆర్ఎస్‌టీ యాజమాన్యానికి సూచించారు. అంబర్‌పేట నియోజక వర్గంలో విద్యపైన దృష్టి సారించక అర్ధాంతరంగా చదువు మధ్యలోనే వదిలేసిన వారు 30 వేలకు పైగా నిరుద్యోగులుగా ఉన్నారని ఇది ఎంతో బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సీఈవో రంజిత్ కౌర్, డియాజియో ఓరియన్ ఇంటర్నేషనల్ సొసైటీ సీఈవో రజిబ్ సింఘా, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీశరన్నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిక్కడపల్లి డివిజన్ ఏసీపీ రమేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అందుకు మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చిక్కడపల్లి డివిజన్ ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ సూచించారు. సోమావరం రాత్రి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చిక్కడపల్లి డివిజన్‌లోని మండప నిర్వాహకులతో సమావేసంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండపాల నిర్వహకులు, భక్తులు పోలీసులకు సహకరంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ముషీరాబాద్ డీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, అభిలాష్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మండపాల నిర్వాహకులు